పోలింగ్‌కు సర్వం సిద్ధం

- రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఎన్నికల సామగ్రితో కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- మొత్తం 6,12,170 మంది ఓటర్లు, 543 పోలింగ్ కేంద్రాలు

రాజేంద్రనగర్: సార్వత్రిక పోలింగ్ కోసం రాజేంద్రనగర్ నియోజకవర్గంలో అధికారులు సర్వం సిద్ధం చేశారు. రాజేంద్రనగర్ వెటర్నరీ కళాశాల ప్రాంగణం నుంచి ఆదివారం సిబ్బంది ఎన్నికల సామగ్రిని భారీ బందోబస్తు మధ్య పోలింగ్ బూత్‌లకు తరలించారు. నియోజకవర్గంలో మొత్తం 543 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలతో పాటు సిబ్బందిని అధికారులు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తరలించారు. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా అధికారులు పోలింగ్ సిబ్బందిని ఉదయం 11.30 గంటలకే మొత్తం 49 రూట్లలో సెక్టార్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాలకు సామగ్రిని తరలించడం విశేషం.

నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు..

నియోజకవర్గంలో మొత్తం 6,12,170 మంది ఓటర్లు సోమవారం తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో మహిళలు 2,95,153, పురుషులు 3,16,979 మంది, ఇతరులు 38 మంది ఉన్నారు.

పోలింగ్ సమయం..

సోమవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కాగా సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనున్నది. వేసవి నేపథ్యంలో గంట సమయం అదనంగా కేటాయించారు. దీంతో సాయంత్ర 6 గంటల వరకు పోలింగ్ బూత్‌లో క్యూ లైన్‌లో ఉన్న వారందరికీ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించనున్నారు.

ప్రతి బూత్‌లో షామియానాలు..

వేసవి నేపథ్యంలో ఓటర్లకు ఇబ్బందుల్లేకుండా వసతులు కల్పించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని ప్రతి పోలింగ్ బూత్‌లో షామియానాలు ఏర్పాటు చేశారు. వీటితో పాటు తాగునీరు, బాత్‌రూమ్‌లు తదితర సౌకర్యాలు కల్పించారు. ఎండ వేడి నుంచి ఉపశమనం పొందేందుకు గాను మజ్జిగను సైతం అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

నియోజకవర్గంలో ప్రత్యేక బూత్‌లు..

రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ప్రత్యేకంగా 12 బూత్‌లు ఏర్పాటు చేశారు. 5 కేంద్రాలు మహిళలకు, 5 మోడల్ పోలింగ్ కేంద్రాలుగా, దివ్యాంగులు, యువత కోసం బూత్‌లను కేటాయించారు. మహిళా పోలింగ్ బూత్‌ను అందంగా తీర్చిదిద్దడంతో పాటు అందులో అధికారులు, సిబ్బంది అంతా మహిళలనే నియమించారు.

49 రూట్లలో సామగ్రి తరలింపు..

నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ బూత్‌లకు 49 రూట్లలో ఎన్నికల సామగ్రిని, సిబ్బందిని అధికారులు తరలించారు. అక్కడికి చేరుకున్న సిబ్బంది ఓటింగ్ కోసం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. నియోజకవర్గంలో మొత్తం 543 పోలింగ్ బూత్‌లను 160 భవనాల్లో ఏర్పాటు చేశారు. ఒక్కో భవనంలో ఒకటి నుంచి ఐదు పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. నియోజకవర్గంలో మొత్తం ఎనిమిది బూత్‌ల్లో 1600 మంది ఓటర్ల కంటే అధికంగా ఉన్నారు.



ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో అధికారులు, సిబ్బంది



భవానీనగర్‌లోని మహిళా మోడల్ పోలింగ్ స్టేషన్



ఎన్నికల సామగ్రితో వెళ్తున్న సిబ్బంది



ఎన్నికల సామగ్రి పంపిణీ చేస్తున్న అధికారులు

పోలింగ్‌కు భారీ బందోబస్తు

మైలార్‌దేవ్‌పల్లి: ఎన్నికల నేపథ్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు రాజేంద్రనగర్ డివిజన్ డీసీపీ శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలింగ్ బూత్‌లతో పాటు పరిసరాల్లో 144 సెక్షన్ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని, అక్కడ సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు అదనంగా పోలీసులను నియమించామని తెలిపారు. ఎక్కడైనా ఎలాంటి ఘటన జరిగిన నిమిషాల వ్యవధిలో చేరుకునేలా ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశామని, అలాగే రౌడీషీటర్లను ఇప్పటికే బైండోవర్ చేశామని పేర్కొన్నారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు షురూ

శంషాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (రాజేంద్రనగర్)లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ బయాలాజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్ కోర్సులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు దోస్త్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని రాజేంద్రనగర్ కళాశాలకు మొదటి ఆప్షన్ ఇవ్వాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9441956233,7032713785 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

అత్తాపూర్: ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్ పరిధిలోని జడ్పీహెచ్ఎస్ అత్తాపూర్ గురునానక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆదివారం స్థానిక పోలీసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని తమకు నచ్చిన అభ్యర్థులను ఓటు ద్వారా ఎన్నుకోవాలని సూచించారు.

వ్యక్తి అదృశ్యం

అత్తాపూర్: భార్యతో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లి అదృశ్యమైన ఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ మహమ్మద్ హర్షద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. మహమ్మద్ మస్తాన్ మియా (42) తన కుటుంబ సభ్యులతో కలిసి ఎంఎం పహడీలో నివాసముంటున్నాడు. రోజువారీ కూలీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బట్టలు సరిగా ఇస్త్రీ చేయలేదని భార్యతో కూడా గొడవపడిన మస్తాన్ మియా ఈ నెల 8వ తేదీన తెల్లవారు జామున వెళ్లిపోయాడు. దీంతో బంధువులు, స్నేహితులు వద్ద గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో భార్య జుబేదాబేగం అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మస్తాన్ మియా పెద్ద కుమార్తెకు పెళ్లి చేయాలని సిద్ధమవుతున్న క్రమంలో ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు.

శివసాయి క్షేత్రంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు



పూజల్లో పాల్గొన్న ఆలయ నిర్వాహకులు, భక్తులు

రాయదుర్గం: వేద బ్రాహ్మణుల మంత్రోచ్చారణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య చండీహోమం, రుద్రహోమం, గణపతి హోమం పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో మూడవ రోజైన శనివారం ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా ప్రత్యేకంగా రామసాయి స్థూపం ప్రతిష్ట కార్యక్రమాన్ని భక్తులు, ఆలయ నిర్వాహకుల సమక్షంలో వైభవంగా నిర్వహించారు. ఆలయంలో కాశీవిశ్వేశ్వరస్వామి, షిర్డీ సాయిబాబా, అన్నపూర్ణాదేవి, గణపతి, ఆంజనేయస్వామి, ధన్వంతరి స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మేనేజింగ్ ట్రస్టీ వాసిరెడ్డిపార్వతి, భక్తులు, ఆలయ నిర్వాహకులు, అర్చకులు పాల్గొన్నారు.

పర్యాటకుల సందడి



గోల్కొండ: గోల్కొండ కోట పర్యాటకులతో కిటకిటలాడింది. నగరంలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగు జిల్లాల నుంచి కూడా పెద్ద ఎత్తున పర్యాటకులు కోటకు తరలివచ్చారు. పాఠశాలలకు సెలవులు కావడంతో తమ తమ పిల్లలతో పలు కుటుంబాలు కోటకు తరలివచ్చాయి. కోటలోని నగీనాబాగ్, క్లాపింగ్ పోర్టికో తదితర ప్రాంతాల వద్ద పిల్లలు సందడి చేస్తూ ఆటలు ఆడుకున్నారు. పలువురు యువ జంటలు క్లాపింగ్ పోర్టికో వద్ద గల భారీ ఫిరంగి వద్ద సెల్ఫీలు దిగారు. రామభక్తులు కోట ఎగువ భాగంలో గల భక్త రామదాసు బందీఖానాను సందర్శించి భక్త రామదాసు చరసాలను సందర్శించారు.

అన్నదానం



గోల్కొండ: నిరంతరాయంగా అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని ప్రభుత్వ బాలుర సెకండ్ లాన్సర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ బషీర్ అన్నారు. ఆదివారం ఆయన ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రముఖ ప్రభుత్వ ఆసుపత్రులైన ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి, సరోజినీదేవి కంటి ఆసుపత్రి, గోల్కొండ ఏరియా ఆసుపత్రులకు దూర ప్రాంతాల నుంచి నిరుపేదలు వైద్యం కోసం వస్తారన్నారు. వీరిలో చాలా మంది ఇన్‌పేషంటర్లుగా ఉండి చికిత్స పొందుతారని వారి వెంట వచ్చే సహాయకులకు ఉచితంగా భోజనం అందించేందుకు తాము కృషి చేస్తున్నామన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మరో కౌన్సిలర్



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీకి చెందిన మరో బీఆర్ఎస్ కౌన్సిలర్ పత్తి ప్రవీణ్‌కుమార్ ఆదివారం కాంగ్రెస్ గూటికి చేరారు. కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బి. జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె. అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో చేరగా ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చే స్తున్న పథకాలు, నార్సింగి మున్సిపాలిటీ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందనే నమ్మకంతోనే కాంగ్రెస్‌లో చేరానని తెలిపారు. కార్యక్రమంలో రాజ్యసభ ఎంపీ అనిల్‌యాదవ్, రాష్ట్ర మైనార్టీ ఎడ్యుకేషన్ కార్పొరేషన్ చైర్మన్ మహ్మద్ ఫహియొద్దీన్ ఖురేషి, మున్సిపాలిటీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ జి.విజయబాబు, నాయకులు మైలారం శ్రీనివాస్, డి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు



పోలింగ్ కేంద్రంలో వసతులు పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ఓటర్లకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేశామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను అధికారులతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ సిబ్బంది, ఓటర్ల సౌకర్యార్థం తాగునీరు, బాత్‌రూమ్స్, దివ్యాంగుల కోసం వీల్ చైర్స్ తదితర అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

14న భగీరథ మహర్షి జయంతి వేడుకలు

సగర సంఘం అధ్యక్షుడు ఉప్పరిశేఖర్



మాట్లాడుతున్న ఉప్పరి శేఖర్

గచ్చిబౌలి: భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఈ నెల 14న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తామని రాష్ట్ర నగర సంఘం అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ తెలిపారు. గచ్చిబౌలి అంజయ్యనగర్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కఠోర దీక్షతో ఒంటి కాలిపై తపస్సు చేసి వరమ శివుడిని ఒప్పించి పవిత్ర గంగను దివి నుంచి భువికి తీసుకొచ్చిన మహనుభావుడు భగీరథుడు అని అలాంటి మహనీయుని జయంతి వేడుకలను నిర్వహించడం సమాజానికి అవసరమన్నారు. సగరజాతి కులగురువైన ఆయన వేడుకలను తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి గ్రామ, మండల, జిల్లా కేంద్రాలలో కూడా సగరులు ఎక్కడికక్కడ ఘనంగా నిర్వహించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలలో అధికారులు భగీరథుని జయంతి వేడుకలు జరుపుతున్నప్పటికీ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడానికి ఎన్నికల కోడ్ రావడంతో ఈ ఏడాది నిర్వహించడం లేదని స్పష్టం చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే వేడుకల్లో బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్ రావు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఇతర ప్రముఖులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం రవి, ప్రధాన కార్యదర్శి ఆవుల వెంకట్‌రాములు, యువజన అధ్యక్షుడు సీతారాం పాల్గొన్నారు.

గ్రామాలకు తరలిన ఓటర్లు

మైలార్‌దేవ్‌పల్లి: సార్వత్రిక సమరంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు మహా నగరంలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న ఓటర్లు తమ స్వగ్రామాలకు ఆదివారం తరలివెళ్లారు. దీంతో ఆరాంఘర్ చౌరస్తాలోని బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసి పోయింది. అయితే ఇదే అదునుగా ఆర్టీసీ అధికారులు టికెట్ల రేట్లు అమాంతగా పెంచారని ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు.

ఉషా గాయత్రికి ఆత్మీయ సత్కారం



నాంపల్లి: సాంస్కృతిక బంధు సారిపల్లి కొండల రావు ఆధ్వర్యంలో యువ కళావాహిని నిర్వహణలో ప్రముఖ కూచిపూడి నృత్య గురువు డాక్టర్ మద్దాళి ఉషా గాయత్రికి కేంద్ర సంగీత నాటక అకాడమి పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా ఆత్మీయ సత్కార సభ జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో నిర్వహించారు. సారిపల్లి కొండల రావు అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణ హాజయ్యారు. దూరదర్శన్ పూర్వ డైరెక్టర్ హైదరాబాద్ డాక్టర్ పాలకుర్తి మధుసూదనరావు హాజరై సభను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం, సినీ రచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ, కూచిపూడి నాట్య గురువు డాక్టర్ ఎస్.పి.భారతి, యువకళావాహిని అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ, కిన్నెర రఘురామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మద్దాళి ఉషా గాయత్రి దంపతులను సత్కరించారు. సభా ప్రారంభంలో డాక్టర్ మద్దాళి ఉషా గాయత్రి శిష్య బృందంచే ప్రదర్శించిన భజ గోవిందం సాంస్కృతిక కార్యక్రమం ఆకట్టుకుంది.

నృత్యం.. మంత్రముగ్ధం



మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. చెన్నై నుంచి వచ్చిన భరతనాట్య కళాకారిణి రక్షా దేవనాదన్ నట్టైకురంజి రాగం వర్ణం, జయదేవ అష్టపది అంశాలను ప్రదర్శించి ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశారు. కళాకారులు దీక్ష, అద్వితీ, శ్లోక, నయోనికా, లాస్య, లక్ష, సమన్విత, హెత్విక, తమదైన శైలిలో నృత్యాలు ప్రదర్శించారు.

\- మాదాపూర్

ఘనంగా శంకర్‌జీ జయంతి



అబిడ్స్: ఎగ్జిబిషన్ సొసైటీ వ్యవస్థాపకుడు దివంగత శంకర్‌జీ 112వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఎగ్జిబిషన్ సమీపంలోని ఆయన విగ్రహానికి ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు వినయ్‌కుమార్ ముదిరాజ్, డాక్టర్ గంగాధర్, హన్మంతరావు, సురేందర్‌జీ, రాజేశ్వర్ ఇతర ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ విద్యారంగ అభివృద్ధికి, సమాజ అభ్యున్నతికి శంకర్‌జీ చేసిన సేవలు వారు కొనియాడారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్



సంతోష్‌నగర్: అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న ఓ స్థావరంపై కంచన్‌బాగ్ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఇద్దరిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..మిధాని సమీపంలోని గుడిసెల్లో నివాసముంటున్న కేతావత్ జ్యోతి (35), నేనావత్ తిరుపతి (30)లు గుట్టు చప్పుడు కాకుండా అక్రమంగా మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీనిపై విశ్వసనీయమైన సమాచారం అందుకున్న కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు స్థావరంపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో జ్యోతి, తిరుపతిను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 31 బాటిళ్లు (ఓసీ–180ఎంఎల్), 46 బాటిళ్లు (ఓసీ–90ఎంఎల్), 25 బాటిళ్లు (కీకీ ఫైన్–180ఎంఎల్), 11 బాటిళ్లు (మ్యాడ్ డాల్స్–180ఎంఎల్), 30 బాటిళ్లు (ఇంపీరియల్ బ్లూ–180ఎంఎల్), 21 బాటిళ్లు (హైవార్డ్స్–5000–650ఎంఎల్)లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా మాతృ దినోత్సవం



మహిళలను సన్మానిస్తున్న సభ్యులు

హఫీజ్‌పేట్ : మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వేడుకలు ఆదివారం చందానగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాతృమూర్తులకు శాలువాతో సన్మానించారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ వ్యవస్థాపక అధ్యక్షులు కొండ విజయ్ మాట్లాడుతూ.. క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మాతృదినోత్సవ వేడుకలకు నిర్వహిస్తున్నామన్నారు. సమాజంలో అమ్మది ఒక ప్రత్యేక స్థానమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు మారం వెంకటేశ్వర్లు గుప్తా, మదుసుధన్‌రెడ్డి, విజయ్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.